

## నా జీవితంలో టర్నింగ్ పాయింట్

అగ్ర నటుడు చిరంజీవి కెరీర్‌ను మలుపుతిప్పిన చిత్రాల్లో 'ఖైదీ' (1983) ఒకటి. ఈ సినిమా ఆయనకు స్టార్‌డమ్‌ను తీసుకొచ్చింది. కమర్షియల్ కథానాయకుడిగా ఎస్టాబ్లిష్ చేసింది. ఈ సినిమా విడుదలై 40 ఏండ్లు అవుతున్న సందర్భంగా చిరంజీవి తన సోషల్ మీడియా ఖాతాలో ఓ ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. 'నా జీవితంలోనే 'ఖైదీ' గొప్ప టర్నింగ్ పాయింట్‌లా నిలిచింది. అభిమానుల గుండెల్లో నన్ను శాశ్వత ఖైదీని చేసింది. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించిన తీరు ఎప్పటికీ మరువలేనిది. ఈ సినిమా విడుదలై 40 సంవత్సరాలు అయిన సందర్భంగా చిత్ర దర్శకులు ఏ.కోదండ రామిరెడ్డిగారిని, నిర్మాతలు సంయుక్త మూవీస్ టీమ్‌ను, రచయితలు పరుచూరి సోదరులను, నా కో-స్టార్స్ సుమలత, మాధవిలను అభినందిస్తున్నాను. అంత గొప్ప విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులందరికీ నా హృదయ పూర్వక ధన్యవాదాలు' అని చిరంజీవి ఎక్స్ (ట్విట్టర్)లో పేర్కొన్నారు. ప్రస్తుతం చిరంజీవి.. వశిష్ట దర్శకత్వంలో సోషియో ఫాంటసీ చిత్రంలో నటిస్తున్నారు.



సాక్షి వైద్య

## యాభైశాతం యాక్షన్



సల్మాన్‌ఖాన్, కత్రినాకైఫ్ జంటగా నటిస్తున్న చిత్రం 'టైగర్-3'. ఈ సినిమాలో షారుఖ్‌ఖాన్ అతిథి పాత్రలో కనిపించనున్నారు. సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీ టైగర్, టైగర్ జిందాహై సిరీస్‌లో మూడో సినిమాగా 'టైగర్-3'ని తెరకెక్కించారు. నవంబర్ 12న హిందీ, తమిళ, తెలుగు భాషల్లో భారీ స్థాయిలో విడుదలకానుంది. దర్శకుడు మనీష్‌శర్మ చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఈ సినిమా టీజర్, ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. యాక్షన్ ఘట్టాలు రోమాంచితంగా ఉన్నాయని అంటున్నారు. అయితే ట్రైలర్‌లో చూసింది కేవలం ఒక్క శాతం యాక్షన్ మాత్రమే. దాదాపు 50 శాతం భారీ పోరాట ఘట్టాలుంటాయి. ప్రేక్షకులకు ఓ యాక్షన్ ఫీస్ట్‌లా అనిపిస్తుంది. వెండితెరపై సరికొత్త లోకాన్ని చూస్తున్న అనుభూతికిలోనవుతారు. రియల్ హీరోయిజంతో ఈ సినిమాను తెరకెక్కించాం' అని చెప్పారు. యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా 'టైగర్-3' చిత్రాన్ని తెరకెక్కించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి.



## 'బుజ్జీ ఇలా రా-2' ప్రారంభం

ధనరాజ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'బుజ్జీ ఇలా రా-2' చిత్రం ఇటీవల ప్రారంభమైంది. 'నో లిమిట్స్' ఉపశీర్షిక. 'గరుడవేగ' అంజి దర్శకత్వం వహిస్తున్నారు మై సినిమా టాకీస్ పతాకంపై కాశీం నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు సాయిరాజేష్ క్లాప్‌నివ్వగా, సి.కల్యాణ్ కెమెరా స్విఛాన్ చేశారు. ఈ సినిమాలో థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో పాటు తండ్రీకూతుళ్ల మధ్య ఉండే ఎమోషన్ హృదయానికి హత్తుకునేలా ఉంటుందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫీ: సర్వేష్‌మురారి, పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: చరణ్ అర్జున్, దర్శకత్వం: 'గరుడవేగ' అంజి.

## విజయ్ దేవరకొండ జోడీగా..

సినిమాలకు సంబంధించి కథానాయికలు చివరి నిమిషంలో మారిపోవడం ఇండస్ట్రీలో చాలా సహజమైన విషయమే. డేట్స్ సమస్యల వల్లే ఇలాంటి ఇబ్బందులు వస్తుంటాయి. తొలుత ప్రకటించిన నాయిక స్థానంలో మరొకరు వచ్చి చేరడం ఇటీవల కాలంలో ఎక్కువగా జరుగుతున్నది. విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న తాజా చిత్రం నుంచి కథానాయిక శ్రీలీల తప్పుకునే ఛాన్స్ ఉందని గాసిప్స్ వినిపిస్తున్నాయి. ఈ సినిమాలో రష్మిక మందన్నను హీరోయిన్‌గా తీసుకోబోతున్నారని తెలిసింది. అయితే తాజాగా ఈ ప్రాజెక్ట్ విషయంలో మరో నాయిక సాక్షి వైద్య పేరు కూడా వినిపిస్తున్నది. ఏజెంట్, గాండీవధారి అర్జున చిత్రాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు చేరువైందీ భామ. విజయ్‌దేవరకొండ-గౌతమ్ తిన్ననూరి చిత్రంలో సాక్షి వైద్యను కథానాయికగా ఖరారు చేసే ఛాన్స్ ఉందని వార్తలొస్తున్నాయి. అయితే ఇవన్నీ కేవలం పుకార్లు మాత్రమేనని, చిత్ర నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన వస్తేనే నిజానిజాలేమిటో తెలుస్తున్నాయని అంటున్నారు.



## ఉపేంద్ర అందించే సందేశం

కంచర్ల ఉపేంద్ర, సావిత్రి జంటగా నటిస్తున్న చిత్రం 'ఉపేంద్రగాడి అడ్డా'. ఆర్యన్ సుభాన్ ఎస్.కె దర్శకుడు. కంచర్ల అచ్యుత రావు నిర్మాత. ఈ చిత్ర టీజర్‌ను ఇటీవల విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే చిత్రమిది. సోషల్‌మీడియాను మంచి మార్గంలో ఉపయోగించుకుంటే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందనే సందేశం ఉంటుంది' అన్నారు. షూటింగ్ మొత్తం పూర్తయిందని, ఈ నెల 29న ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నామని నిర్మాత కంచర్ల అచ్యుతరావు తెలిపారు. నటనపై తనకున్న ఆసక్తిని తెలుసుకొని తన తండ్రి ఐదు సినిమాలను నిర్మించడం అదృష్టంగా భావిస్తున్నానని హీరో కంచర్ల ఉపేంద్ర పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రవీందర్‌సన్, సంగీతం: రాము అద్దంకి, మాటలు: శ్రీనివాస్ తేజ, దర్శకత్వం: సుభాన్ ఎస్.కె.

## 'మహర్‌యోధ్ 1818' ప్రారంభం

రజత్ రాఘవ్, ఐశ్వర్యరాజ్ జంటగా నటిస్తున్న 'మహర్‌యోధ్ 1818' చిత్రం ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. రాజు గుడిగుంట్ల దర్శకత్వం వహిస్తున్నారు సువర్ణ రాజు దాసరి నిర్మాత. ముహూర్తపు సన్నివేశానికి విక్టర్ ప్రసాద్ క్లాప్‌నివ్వగా, దామోదరప్రసాద్ కెమెరా స్విఛాన్ చేశారు. 'సోషల్ థ్రిల్లర్, యాక్షన్ ఫాంటసీ చిత్రమిది. వైవిధ్యమైన కథ, కథనాలతో సాగుతుంది. ప్రేక్షకులను ఆద్యంతం ఉత్కంఠకు గురిచేస్తుంది' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: వెంకట్, సంగీతం: మహా-శశాంక్, నిర్మాణ సంస్థ: డీఎస్ఆర్ ఫిల్మ్స్, దర్శకత్వం: రాజు గుడిగుంట్ల.





సందీప్‌కిషన్, వర్ష బొల్లమ్మ

## భైరవకోనలో ప్రణయలీల

సందీప్‌కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్, హాస్య మూవీస్ పతాకాలపై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా 'హమ్మా హమ్మా' అనే రెండో గీతాన్ని విడుదల చేశారు. నాయకానాయికలు సందీప్‌కిషన్, వర్ష బొల్లమ్మలపై చిత్రీకరించిన ఈ పాట ఫాస్ట్‌బీట్‌తో ఆకట్టుకుంటున్నది. శేఖర్‌చంద్ర స్వరపరచిన ఈ గీతానికి తిరుపతి జవానా సాహిత్యాన్నందించారు. రామ్ మిరియాల ఆలపించారు. ప్రేయసి పట్ల ఆరాధనా భావాన్ని కనబరిచే కథానాయకుడి అంతరంగాన్ని ఆవిష్కరిస్తూ ఈ పాట చక్కటి ప్రణయ భావాలతో సాగింది. ఆద్యంతం సస్పెన్స్, థ్రిల్లర్ అంశాలతో సాగే చిత్రమిదని, భైరవకోనలో జరిగే ఘటనలు అనుక్షణం ఉత్కంఠను పంచుతాయని చిత్ర బృందం పేర్కొంది.

## కోలార్ బంగారు గనుల నేపథ్యంలో..

విక్రమ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'తంగలాన్'. పా రంజిత్ దర్శకుడు. పార్వతీ, మాళవిక మోహనన్ కథానాయికలుగా నటిస్తున్నారు. కోలార్ బంగారు గనుల నేపథ్యంలో యథార్థ ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా భారీ వ్యయంతో రూపొందుతున్నది. స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని జనవరి 26న విడుదల చేయబోతున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన కొత్త పోస్టర్‌లో విక్రమ్ రా అండ్ రస్టిక్ లుక్‌లో కనిపిస్తున్నారు. 'విక్రమ్ మునుపెన్నడూ చూడని అవతారంలో కనిపిస్తారు. నవంబర్ 1న టీజర్‌ను విడుదల చేస్తాం' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, దర్శకత్వం: పా రంజిత్.



విక్రమ్



## గోవాలో దేవర పోరాటం

ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న 'దేవర' చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. ప్రస్తుతం గోవాలో యాక్షన్ ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. ఈ హై ఓల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ సినిమాకు ప్రధానాకర్షణగా నిలుస్తాయని, వీటికోసం హాలీవుడ్ స్టంట్ మాస్టర్స్ పనిచేస్తున్నారని చిత్ర బృందం పేర్కొంది. ఈ షెడ్యూల్ అనంతరం కర్ణాటకలోని గోకర్ణలో కీలక సన్నివేశాలను తెరకెక్కించబోతున్నట్లు సమాచారం. విస్మరణకు గురైన ఓ తీర ప్రాంతంలోని తన ప్రజలను కాపాడుకోవడానికి ఓ ధీరోదాత్తుడైన వ్యక్తి చేసే పోరాటమే ఈ చిత్ర ఇతివృత్తం. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 5న విడుదలకానుంది.



కామాక్షి భాస్కర్ల

## చలం రచనలను ఇష్టపడతా

*'ఈ సినిమా తొలి భాగాన్ని చూడని వారు వెంటనే చూసేయండి. ఫస్ట్ పార్ట్ ఎక్కడ ఎండ్ అయిందో అక్కడే రెండో భాగం మొదలవుతుంది. ప్రతి పది నిమిషాలకు ఓ సర్‌ప్రైజ్‌తో సినిమా ఆసాంతం ప్రేక్షకులను థ్రిల్‌కు గురిచేస్తుంది' అని చెప్పింది డా॥ కామాక్షి భాస్కర్ల. సత్యం రాజేష్ సరసన ఆమె కథానాయికగా నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర-2'. డా॥ అనిల్ విశ్వనాథ్ దర్శకుడు. గౌరికృష్ణ నిర్మాత. నవంబర్ 3న విడుదలకానుంది. ఈ సందర్భంగా డా॥ కామాక్షి భాస్కర్ల శనివారం పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'ఈ సినిమాలో నేను నాయికగా నటిస్తూనే అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాను. ఓ దర్శకురాలి పాయింట్ ఆఫ్ వ్యూలో చూస్తే ఈ సినిమాను అద్భుతంగా తీశారనిపించింది. నేను పోషించిన లక్ష్మి పాత్రతో ప్రేక్షకులందరూ కనెక్ట్ అవుతారు. ఆ క్యారెక్టర్‌లో కాస్త కోపంగా ఉంటూనే అన్ని రకాల ఎమోషన్స్ పండించే అవకాశం దక్కింది. నేను మెడిసిన్ చదివి యాక్టింగ్ ప్రొఫెషన్‌ను ఎంచుకున్నా. నాకు సాహిత్యం అంటే చాలా ఇష్టం. చలం రచనలను ఇష్టపడతాను. బుక్స్ బాగా చదువుతాను. కె.విశ్వనాథ్‌గారి సినిమాల్ని బాగా చూస్తాను. ఈ అభిరుచులే నటనతో పాటు దర్శకత్వ శాఖపై ఆసక్తిని పెంచాయి. 2018లో మిస్ ఇండియా నుంచి నా ప్రయాణం మొదలైంది. ఇప్పటికే చాలా సినిమాల్లో నటించా. అయితే ఈ ఏడాది విజయాలతో నాకు మంచి గుర్తింపు దక్కింది. పరిశ్రమలో మా బంధువులు చాలా మంది ఉన్నారు. అయినా ఇంతవరకు ఎవరి సహాయం తీసుకోలేదు. కెరీర్‌ను ఛాలెంజింగ్‌గా తీసుకొని ముందుకుసాగుతున్నా. ప్రస్తుతం 'మాన్షన్‌హౌస్ మల్లేష్' 'దూత' చిత్రాల్లో నటిస్తున్నా' అని చెప్పింది.*





